## క్లుప్తంగా

### అధినేతతో భేటీ



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో కామిరెడ్డి నాని

**దెందులూరు:** వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ యువజన విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాని మర్యాదపూర్వకంగా కలిశారు. దెందులూరు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వంవైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై పెడుతున్న అక్రమ కేసులు, వేధింపులు, పెన్షన్ల తొలగింపు, సర్వేపై సుదీర్ఘంగా వివరించారు. నాయకులు కార్యకర్తలు పార్టీ అన్ని విభాగాల శ్రేణులు ఐక్యతతో పార్టీ బలోపేతానికి వచ్చే ఎన్నికల్లో విజయం సాధించేందుకు కృషి చేయాలని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కామిరెడ్డి నానికి సూచించారు. మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిని దెందులూరు ఎమ్మెల్యేగా వచ్చే ఎన్నికల్లో విజయం సాధించేలా అందరం కలిసికట్టుగా సహాయ సహకారాలు అందిస్తామని కామిరెడ్డి నాని తెలిపారు.

### సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలి

**దెందులూరు:** సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని వైఎస్సార్ సీపీ నేత సానిగూడెం గ్రామ సర్పంచ్ శనిపల్లి రామకృష్ణ (విష్ణు) అన్నారు. బుధవారం సచివాలయంలో సర్పంచ్ విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు హామీలు ఇచ్చారని సూపర్ సిక్స్‌లో ఒక్క హామీ కూడా అమలు చేయకపోవడం ప్రజలను మోసం సరికాదన్నారు. ప్రతిరోజు ఉచిత బస్సు కోసం నిరుద్యోగులు నిరుద్యోగ భృతి కోసం అడుగుతున్నారని సమాధానం నేను చెప్పలేకపోతున్నామని తెలిపారు.

### గంగన్నగూడెంలో కోడిపందేలు

**దెందులూరు:** మండలంలోని గంగన్నగూడెంలో కోడిపందేలు వేస్తున్నారన్న సమాచారం తెలుసుకుని దెందులూరు ఎస్ఐ ఆర్ శివాజీ సిబ్బందితో మంగళవారం దాడి చేశారు. కోళ్లకు కత్తులు కట్టి పందేలు నిర్వహిస్తుండడంతో ముగ్గురు వ్యక్తులను, కోడి కత్తులను, ఒక కోడిని, రూ. 2,750ల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలు



ప్రమాదంలో గాయపడ్డ విఘ్నేశ్వరరావు

**ఉంగుటూరు:** మండలంలోని జాతీయరహదారిపై ఏలూరు వైపు వెళ్లే మార్గంలో చేబ్రోలు వద్ద మోటారు సైకిల్ వృద్ధుడిని ఢీకొన్న సంఘటన బుధవారం జరిగింది. ఈ ప్రమాదంలో విఘ్నేశ్వరరావు (65)కి తీవ్రగాయాలు కాగా, బైక్ నడిపే అభిషేక్ కుమార్ అనే యువకుడుకు గాయాలయ్యాయి. ఇరువుర్నీ తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### అక్రమ మట్టి తవ్వకం నిలుపుదల

**ఉంగుటూరు:** మండలంలోని గోపినాథపట్నం కాలనీ వెనుక అక్రమ మట్టి తవ్వుతున్నారని సమాచారం అందుకున్న రెవెన్యూ యంత్రాంగం బుధవారం సాయంత్రం అప్రమత్తమయ్యారు. దీంతో మట్టి తవ్వుతున్న జేసిబి, ట్రాక్టరు తవ్వే ప్రదేశం నుంచి పరారయ్యారు. మట్టితో ఉన్న లారీ మాత్రం అక్కడ వదిలేసి డ్రైవరు వెళ్లిపోయాడు. చేబ్రోలుకు చెందిన జనసేన నాయకుడు ఒకరు మట్టి తవ్వించి మెరకలకు తరలించే వ్యాపారం సాగిస్తున్నారని తెల్సింది. మండలంలో ఏదొక చోట నుంచి అక్రమంగా మట్టి తరలించే పనులు జరుగుతూనే ఉన్నాయి. రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగ పనిచేస్తున్నా మట్టి మాఫీయా రెవెన్యూ యంత్రాంగాన్ని పట్టించుకున్న దాఖలులు లేవు.

### ఘనంగా కాగుపాడు పాఠశాల వార్షికోత్సవాలు

**ఉంగుటూరు:** మండలంలోని కాగుపాడు నెం 2 పాఠశాల వార్షికోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఆనందకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రహ్లాదుడు నాటిక అందరిని ఆకర్షించింది. విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ వైస్ చైర్మన్ బోయిన త్రినాథ్, గ్రామ పెద్దలు కడియాల రవిశంకర్, జానికి రామ్, వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు హరికృష్ణ, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

### 21 నుంచి నాగలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు

**దెందులూరు:** మండలంలోని గాలాయగూడెంలోని అచ్చమ్మ పేరంటాలు తల్లి ఆలయ ఆవరణలో భీమనాగలింగేశ్వర స్వామి ఆలయ ఏడవ వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 21 నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు.

# సర్వేతో గుండెల్లో గుబులు

- పీ-4 సర్వేపై అనుమానాలు
- 27 ప్రశ్నలకు సమాధానాల సేకరణ
- పథకాలు తీసివేస్తారేమోనని ప్రజల్లో ఆందోళన

**దెందులూరు:** మండలంలో పీ-4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్‌షిప్) సర్వే కొనసాగుతోంది. మండల పరిషత్ ఆధ్వర్యంలో 20సచివాలయాల పరిధిలో ఇళ్లను సర్వే చేస్తున్నారు. పేదలకు ఆర్థికంగా బలోపేతం చేసే ఉద్దేశంతో ప్రభుత్వం నిర్వహిస్తోందని అధికార యంత్రాంగం చెబుతున్నా ప్రజల్లో ఆందోళన నెలకొంది. సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అడుగుతున్న ప్రశ్నలకు ప్రజలకు ఖంగుతింటున్నారు. సంక్షేమ పథకాల ఏరివేతకై నా ఇటువంటి ప్రశ్నలు వేస్తున్నారనే ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతోంది. సర్వేపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడంలో అధికారులు కూడా విఫలమవుతున్నారు.

**ప్రశ్నలే..ప్రశ్నలు**

సచివాలయ సిబ్బంది క్లస్టర్ల వారీగా ఆయా కుటుంబాల నుంచి సామాజిక, ఆర్థిక స్థితిగతులను 27ప్రశ్నల ఆధారంగా సమాచారం నమోదు చేస్తున్నారు. ఆధార్, బ్యాంకు ఖాతా, ఇంట్లో టీవీ, ఫ్రిజ్, వాషింగ్ మిషన్, ఏసీ, ల్యాప్ టాప్ వంటి అంశాలను ఆరా తీస్తున్నారు. ఇంట్లో ఎంతమంది సంపాదిస్తున్నారు. ఉద్యోగం చేస్తున్నారా...ఆస్తులు, ఆదాయం ఇన్‌కమ్‌టాక్స్, బైక్, కారు ఉన్నాయా వంట గ్యాస్ నెలకు ఎంత కరెంటు బిల్లు వస్తుంది. కుళాయి కనెక్షన్ ఉందా తదితర ప్రశ్నలు వేస్తుండటంతో ప్రజల్లో అనుమానాలు కలుగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఏమైనా పథకాలు అందుతున్నాయనా అనే వివరాలను సేకరించి వాటిని సచివాలయాలకు అనుసంధానం చేస్తున్నారు. సర్వేను ఎంపీడీవో, ఈఓపీఆర్ పర్యవేక్షిస్తున్నారు. మండలంలో 20సచివాలయాల పరిధిలో 22, 502ఇళ్లు ఉన్నాయి. ఇప్పటి వరకు దాదాపు ఇళ్ల సర్వే పూర్తైంది.



ఇంటింటా సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

**వివరాలు చెప్పేందుకు నిరాకరణ**

పలు గ్రామాల్లో కుటుంబాల వ్యక్తిగత వివరాల సేకరణలో సచివాలయ సిబ్బందికి ప్రజల నుంచి సహకారం కొరవడుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించింది. గత ఎన్నికలకు ముందుకు అనర్హులు ప్రభుత్వ పథకాలు పొందుతున్నారని, తాము అధికారంలోకి వస్తే అనర్హులను ఏరి వేస్తామంటూ కూటమి నేతలు ప్రకటనలు చేశారు. అధికారంలోకి రావడంతోనే సంక్షేమ పథకాల లబ్ధిదని తగ్గించడం ప్రారంభించింది. పింఛన్లలో కోత కొత్తవి మంజూరు ఎండమావిగా మారింది. లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పుడు పీ-4 పేరిట వివరాలు అడుగుతుంటే వారిలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంక్షేమ పథకాలను దూరం చేసేందుకే ఈ వివరాలు సేకరిస్తున్నారని సిబ్బందిపై మండిపడుతున్నారు. వివరాలు చెప్పేందుకు చాలా మంది నిరాకరిస్తున్నారు.

**సర్వేపై ఆందోళన వద్దు**

గ్రామాల్లో చేపడుతున్న పీ-4 సర్వే పట్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రజల జీవన ప్రమాణాలు స్థితి గతులను తెలుసుకుని సంక్షేమ పథకాలు అందించేందుకు నిర్వహిస్తోంది. మండలంలో 20 సచివాలయాల్లో నూరు శాతం సర్వే పూర్తయింది. ఉద్యోగులు ప్రణాళిక అంకితభావంతో సర్వేను ప్రభుత్వ లక్షణాలు కనుగుణంగా పూర్తి చేశారు.

కే శ్రీదేవి ఎంపీడీవో దెందులూరు

### విశ్వాసంతోనే అద్భుత విజయాలు సొంతం



పెదలింగంపాడులో కొత్త ఆర్‌సీఎం చర్చికి శంఖుస్థాపన చేస్తున్న దృశ్యం

**భీమడోలు:** క్రైస్తవులు విశ్వాసంతోనే అద్భుత విజయాలు అందిపుచ్చుకుంటార ని రెవరెండ్ ఫాదర్లు జోబి, ధోని, కిరణ్‌రాయల్‌లు అన్నారు. భీమడోలు పంచాయతీ పరిధిలోని పెదలింగంపాడు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆర్‌సీఎం చర్చికు బుధవారం ఘనంగా శంఖుస్థాపన కార్యక్రమం జరిగింది. సిలువ గుర్తు గల స్టోన్‌ను వేసి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఫాదర్లు జోబి, ధోని, కిరణ్‌రాయల్‌లు మాట్లాడుతూ క్రైస్తవుల సోదరులంతా ఐక్యతతో కొత్త చర్చి నిర్మించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ పులిపాటి తంబి, గ్రామ పెద్దలు ఓగిరాల సురేష్, కొండా సుబ్బారావు, గోరింకల సంజీవరావు, వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ ముళ్లగిరి జాన్సన్, గ్రామస్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పంటకు చీరలే రక్షణ

**పంటను కాపాడుకునేందుకు వినూత్న ప్రయోగాలు చేస్తున్న రైతులు**

**భీమడోలు:** ఆరుగాలం పండించిన పంటను కాపాడుకునేందుకు రైతులు వినూత్న ప్రయోగాలు అవలంభిస్తున్నారు. పచ్చని పంటను రక్షించుకునేందుకు రైతన్నలు ఎన్నెన్నో ప్రయత్నాలు చేసి కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. వరి సాగుకన్నా ఉద్యానవన పంటలను సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చునని రైతాంగం భావిస్తుంది. దీనికి తోడు ఆకు కూరలు, ఆకుకూరల ధరలు ఆకాశన్నండడంతో రైతులు ఉద్యానవన పంట సాగుపై ఆసక్తిని కనుబర్చుతున్నారు. అయితే మెట్ట రైతాంగం ఉద్యానవన పంటలపై నక్కలు, ఇతర జంతువులు దాడి చేసి పంటలను తీవ్రంగా నష్టం చేస్తున్నాయి. దీనితో కొంత మంది రైతులు చేను చుట్టూ విద్యుత్ తీగలు అమర్చుతుండడంతో విద్యుత్ తీగల వల్ల పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో విద్యుత్, పోలీస్ శాఖలు విద్యుత్ తీగలు పెట్టవద్దంటూ సూచించడంతో రైతులు వినూత్న పద్ధతులపై దృష్టి సారించారు. వాటిని సంరక్షించుకునేందుకు రైతులు చేసే పద్ధతుల వల్ల ప్రాణాప్రాయ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీంతో జంతువులు చొరబడకుండా మైకులతో శబ్దాలు చేయడం, చీడ పీడల నుంచి సంరక్షణ, విష పురుగులు, దిష్టి కళ్ల పడి తమ పంట దిగుబడిపై ప్రభావం పడుతుంది. దీనితో పంట నష్టం వాటిల్లకుండా రైతులు పంట చుట్టూ పాత చీరలు, నర్సరీల చుట్టూ తెరలు కట్టి పంటను వెయ్యి కళ్లలో కాపలా కాస్తున్నారు. భీమడోలు సబ్ డివిజన్ ఉద్యానవన శాఖ పరిధిలోని భీమడోలు 2100 ఎకరాలు, ద్వారకాతిరుమల 41వేల ఎకరాలు, ఉంగుటూరులో 4800 ఏకరాల్లో ఉద్యానవన పంటల సాగు చేస్తున్నారు. పాక్షిక మెట్ట మండలాలైన భీమడోలు, ఉంగుటూరు మండలాల్లో అయిల్‌ఫామ్, కొబ్బరి, ఖోఖో, ఆకుకూరలు, ఆకు కూరలు, అరటి పంటలు పండిస్తుంటారు. మెట్ట మండలం ద్వారకాతిరుమల మండలంలో అయిల్ ఫామ్, కొబ్బరి, ఖోఖో, దొండ, బెండ, క్యాబేజి, కాలిఫ్లవర్, చెరకు తదితర పంటలను ఎక్కువగా రైతులు విస్తీర్ణం సాగు చేస్తున్నారు. అయితే ఎక్కువగా రోడ్డు ప్రక్కనే ఉన్న పంటల్లో ఎక్కువగా జంతువులు చొరబడి పంట నష్టం చేస్తుండడంతో రైతులు వాటి నుంచి రక్షించుకునే ప్రయత్నంలో పలు వినూత్న ప్రయోగాలను అవలంభిస్తున్నారు. చీడ పీడలు సోకకుండా పంట చుట్టూ చీరతో చుట్టేస్తున్నారు. నర్సరీలో నారు దెబ్బతినకుండా పూర్తిగా తెరలను కప్పేస్తున్నారు. కళ్ల దిష్టి నుంచి కాపాడేందుకు సినిమా హీరోయిన్ల ఫోటోలు పెడుతున్నారు. దీనితో పంటపై దాడి చేసేందుకు వచ్చే జంతువులు వాటిని చూసి దూరంగా ఉంటాయని రైతులు చెబుతున్నారు. అదే విధంగా రాత్రి వేళల్లో జంతువుల బెడద నుంచి కాపాడుకునేందుకు మైక్‌లు పెద్ద పెద్ద శబ్దాలు చేస్తున్నారు. దీనితో రైతులు మైకులు ఏర్పాటుకు రూ.1000ల వరకు అదనంగా ఖర్చు పెట్టాల్సి వస్తుంది. ఏదీ ఏమైనా తమ పంటను కాపాడుకునేందుకు శతవిధాలుగా రైతులు ప్రయత్నాలు చేస్తూ కొంత మేర సఫలీకృతులవుతున్నారు. . దీనిపై ఉద్యానవన అధికారి దేవదానం మాట్లాడుతూ భీమడోలు, ద్వారకాతిరుమల, ఉంగుటూరు, నిడమర్రు మండలాల పరిధిలో సుమారు 47వేల ఎకరాల్లో ఉద్యానవన పంటలను సాగు చేస్తున్నారు. ఈ పంటలను రైతులు కంటికి రెప్పలా కాపాడడంతో పలు ప్రయత్నాలు చేస్తున్నారు. రైతులకు సాగులో మెలకువలను అందించి వారి ఆర్థిక స్వావలంబనకు ఉద్యానవన సిబ్బంది తమ వంతు కృషి చేస్తున్నారు.



భీమడోలు జంక్షన్ సమీపంలో ఓ చేను చుట్టూ చీర కప్పిన దృశ్యం



ఆంజనేయనగరం వద్ద నర్సరీ చుట్టూ పూర్తిగా కప్పి ఉంచిన తెరలు



సూరప్పగూడెం వద్ద ఓ రైతు కళ్ల దిష్టి పడకుండా ఓ సినిమా హీరోయిన్ ఫోటో పెట్టిన దృశ్యం

### తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

**భీమడోలు:** మండలంలోని కొల్లేరు గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. మండలంలోని గుండుగొలను, ఆగడాలలంక, చెట్టున్నపాడు, మల్లవరం గ్రామాల్లో బుధవారం జిల్లా పంచాయతీ అధికారి కె.అనూరాధతో కలిసి ఆమె పర్యటించారు. గుండుగొలనులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి కేంద్రం పనితీరును వారు పరిశీలించారు. పొడి, తడి చెత్త సేకరణ, సేంద్రియ ఎరువు తయారీ, కేంద్రంలోని యంత్రాల పనితీరుపై సంబంధిత అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీలు చెత్త నుంచి సంపద సాధించి ఆర్థిక స్వావలంబన పొందాలన్నారు. సేంద్రియ ఎరువులను విక్రయించి పరిపుష్టిని సాధించాలన్నారు. వేసవిలో కొల్లేరు గ్రామాల్లో మంచినీటి సమస్యలు రాకుండా సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో అపారిశుద్ధ్య వాతావరణం తలెత్తకుండా పారిశుద్ధ్య డ్రైవ్ జరుగుతుందన్నారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ పద్మావతి, ఈవోఆర్‌డీ ఏ.సుందరి, గ్రామకార్యదర్శి మురళీ, మాజీ ఎంపీపీ శిరిబత్తిన కొండబాబు, ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



ఆగడాలలంకలో మంచినీటి సమస్యను జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీకి వివరిస్తున్న దృశ్యం

### ఉపాధి కార్మికులకు పని దినాలు పెంచి ఆదుకోవాలి

**భీమడోలు:** మండలంలోని జాతీయ ఉపాధి హామీ పథకం కార్మికులకు 200 రోజుల పని దినాలు కల్పించాలని, రోజువారి వేతనం రూ.600లకు పెంచి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.లింగరాజు డిమాండ్ చేశారు. పోలసానిపల్లిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల సమస్యలను బుధవారం సీపీఎం బృందం సభ్యులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా యాంత్రీకరణ వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని కార్మికులకు పనుల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు పనులు తగ్గిపోయాయన్నారు. దీనితో వారంతా ఉపాధి హామీ పథకపు పనులపై ఆధారపడి జీవిస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులను పెంచి ఏడాదికి 200 పనిదినాలతో పాటు ప్రతి రోజు రూ.600లు వేతనం ఇవ్వాలని, తద్వారా దేశంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం భీమడోలు పంచాయతీ పరిధిలోని అర్జావారిగూడెంలోని ఎన్టీఆర్ కాలనీలో 15 ఏళ్లుగా మంచినీరు, రోడ్లు, కరెంట్ సదుపాయం కల్పించలేదని, నానా అవస్థలు పడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కట్టా భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



పోలసానిపల్లిలో ఉపాధి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

### కోకో రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

**పెదవేగి :** ఈనెల 20న విజయరాయిలో కోకో రైతుల రాష్ట్ర సదస్సుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ చెప్పారు. బుధవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం ఆధ్వర్యంలో సదస్సు వస్తున్న వారికి స్వాగతం బేనర్లు కట్టారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కోకో రైతుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏలూరు జిల్లాతో పాటు కోకో సాగు చేస్తున్న అన్ని జిల్లాల నుంచి కోకో రైతుల తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. విజయరాయిలోని గాంధీ నగర్ లో గల సీతారామ కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని చెప్పారు. సదస్సులో కోకో రైతుల సమస్యలపై తీర్మానాలు చేసి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. కోకో రైతులంతా సంఘటితం కావాలని విజ్ఞప్తి చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

### పెదపాడు సొసైటీలో అపరాల కొనుగోలు



తోటగూడెంలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్

**పెదపాడు:** మండలంలోని పెదపాడు కో ఆపరేటివ్ సొసైటీలో అపరాల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్ తెలిపారు. రైతులు రైతు సేవా కేంద్రాల్లో సీఎం యాప్ రిజిస్ట్రేషన్ చేసుకుని అపరాలు అమ్ముకోవచ్చునని చెప్పారు. దీంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. స్థానికులు పెద్దిరెడ్డి రమేష్, కాట్రం సురేష్ ఉన్నారు.

### 'మానవతా' సేవలు మరువలేనివి

**పెదవేగి :** మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. తడికలపూడి శాఖ వారి ఆధ్వర్యంలో ఏలూరు కామినేని హాస్పిటల్, శంకర్ నేత్రాలయ కంటి వైద్య హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ముండూరు గ్రామంలో సొసైటీ బ్యాంకు ఆవరణలో ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని మానవతా అధ్యక్షుల నెక్కలపూడి సురేష్‌బాబు ప్రారంభించారు. కామినేని హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కొడాలి రాంప్రసీన్, డాక్టర్ వై .నిచ్చల్‌లు 95 మందికి, శంకర్ నేత్రాలయ డాక్టర్ దివ్య రవళి 92పేషెంట్లకు వైద్య పరీక్షలు చేసి, కళ్లజోళ్లు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ముండూరు మానవతా గ్రామ కన్వీనర్ ఆళ్ళ విజయ్ గోపాల్, సొసైటీ సెక్రటరీ బలుసు ప్రసాద్, మానవతా చైర్మన్ గంగాధర్ ప్రసాద్, సెక్రటరీ శివ నాగమల్లేశ్వరరావు, కన్వీనర్ వంగపండు, శ్రీనివాసరావు, డైరెక్టర్ నల్లూరు కాంతారావు, జాదం నరేష్, కొండూరు మానవతా సభ్యులు ,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



ముండూరులో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

### క్లస్టరు విధానానికి అనుకూలమే

**పెదపాడు:** క్లస్టరు విధానానికి మేం అనుకూలమేనని ఏపీపీఎస్సీ ద్వారా నియమితులైన వీఆర్వోలు జిల్లా కలెక్టరు కె వెట్రిసెల్వికి వినతి పత్రాన్ని అందజేశారు. 2012, 2014లో ఏపీపీఎస్సీ నిర్వహించిన పరీక్ష ద్వారా సుమారు 1800 మంది నియమితులైయ్యాయమని, మాకు పదోన్నతి కల్పించి సీనియర్ అసిస్టెంట్‌గాను మిగిలిన వారిని జూనియర్ అసిస్టెంట్‌లు రెవెన్యూతో పాటు ఏఇతర శాఖలోనైనా నియమించినా జాయిన్ కావడానికి మేం సిద్ధంగా ఉన్నామని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం అందించిన వారిలో జిల్లా నాయకులు సాల్మన్‌రాజు, వీఆర్వోలు ప్రసాద్, శివనాగకృష్ణ, అరుణ్‌కుమార్ శివ, ప్రమీల, ఇందిర, పావని తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టరు కె వెట్రి సెల్వికి వినతిపత్రం అందజేస్తున్న వీఆర్వోలు

### ఇన్‌చార్జి ఏపీఓగా ఫాతిమా

**దెందులూరు:** జాతీయ ఉపాధి హామీ పథకం దెందులూరు మండల ఇన్‌చార్జి ఏపీఓగా పి ఫాతిమా నియమితులయ్యారు. ఈ మేరకు డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఫాతిమా ప్రస్తుతం దెందులూరు మండల టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఇప్పటివరకు దెందులూరు ఏపీవోగా పనిచేసిన దశరథ రాంజీ డ్వామా జిల్లా కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.



ఫాతిమా, ఇన్‌ఛార్జి ఏపీఓ

### అంగన్‌వాడీలకు నేటి నుంచి ఒంటిపూట బడులు

**దెందులూరు:** అంగన్‌వాడీ కేంద్రాలకు నేటి నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాలని ప్రభుత్వం లిఖితపూర్వ ఆదేశాలు జారీ చేసిందని ఐసీడీఎస్ దెందులూరు సెక్టార్ సూపర్‌వైజర్ చిట్టెమ్మ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి అంగన్‌వాడీ కేంద్రాలు ప్రారంభమై మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించాలని ఆదేశాల్లో ఉందన్నారు. ప్రభుత్వ ఆదేశాలు సమయాలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించడం జరిగిందన్నారు. తల్లిదండ్రులు ఉదయం చిన్నారులను పంపించేలా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

### పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు

**దెందులూరు:** మండలంలో పదో తరగతి పరీక్షలు జరుగుతున్న నాలుగు కేంద్రాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాకేష్, డాక్టర్ రోజా అన్నారు. దెందులూరులో రెండు, పోతునూరులో ఒకటి, గోపన్నపాలెంలో ఒక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఒక్కో వైద్య శిబిరంలో హెల్త్ అసిస్టెంట్ ఆశా కార్యకర్త ఉన్నారన్నారు. పదీ పరీక్షలు ముగిసే వరకు వైద్య శిబిరాలు కొనసాగుతాయని వివరించారు.

### పది పరీక్షలు ప్రశాంతం

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** పట్టణంలో పదో తరగతి పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు హిందీ పరీక్ష జరిగింది. పట్టణంలో 8 సెంటర్‌లలో జెడ్పీ ఉన్నత పాఠశాల, సుబ్బారావుపేట మునిసిపల్ ఉన్నత పాఠశాల, కడకట్ల కోడే వెంకట్రావు మునిసిపల్ ఉన్నత పాఠశాల, భాష్యం, శ్రీ చైతన్య, నారాయణ, కింబర్లీ, సెంట్ జోన్స్ సెంటర్‌లలో పరీక్షలు నిర్వహించారు. కేంద్రాలు వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. పరీక్షకు హాజరుకావాల్సిన వారు మొత్తం విద్యార్థులు 1,766 మంది కాగా 1,732 మంది హాజరయ్యారు. 34 మంది హాజరు కాలేదు. స్క్వాడ్ భీమవరం అధికారులు ఆయా కేంద్రాలను తనిఖీలు చేశారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని సంబంధిత అధికారులు వివరించారు.

### పది పరీక్షా కేంద్రం పరిశీలన

**పెదపాడు:** మండలంలోని కలపర్రులోని పది పరీక్షా కేంద్రాన్ని పెదపాడు ఎస్సై కట్టా శారదా సతీష్ పరిశీలించారు. బుధవారం పది పరీక్షల్లో భాగంగా ఆయన పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఎలాంటి సహాయం కావాలన్నా వెంటనే తమకు సమాచారం అందజేయాలన్నారు. ప్రశాంత వాతావరంలో పరీక్షలు జరుగుతున్నాయని ఎస్సై చెప్పారు.



పెదపాడు పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న పెదపాడు ఎస్సై కట్టా శారదా సతీష్